మన చౌరాస్తా

నేడే బిగ్ ఫైట్

Special Edition

# ఫలితాలపై లబ్‌డబ్..!

- ఎమ్మెల్యే పల్లా పట్టు నిలుపుకునేనా!
- ఉనికి కోసం కొమ్మూరి గురి..!
- 'మోడీ' మానియాపై ఆరుట్ల ఆశలు..
- అభ్యర్థులకు మించిన హైటెన్షన్ వీరికే..
- విలక్షణ తీర్పుకు కేరాఫ్ 'జనగామ'

**జనగామ, మన చౌరాస్తా ప్రతినిధి :**

ఉత్కంఠ భరితంగా సాగిన పార్లమెంట్ ఎన్నికల పోరులో గెలుపు ఎవరిది అనేది మరికొన్ని గంటల్లో తెలియనుంది. ఈ రిజల్ట్ పై పోటీలో ఉన్న అభ్యర్థుల కంటే వారికి సపోటర్స్‌గా పనిచేసిన నేతలు, లీడర్లు సైతం హైటెన్షన్‌కు గురవుతున్నారు. ముఖ్యంగా భువనగిరి పార్లమెంట్ పరిధిలోని జనగామ నియోజకవర్గం ఓటర్లు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## ఎమ్మెల్యే ఎన్నికల్లో విలక్షణ తీర్పు

ఎమ్మెల్యే ఎన్నిక ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగినా.. జనగామ ఓటర్లు మాత్రం విలక్షణ తీర్పునిచ్చారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఆరుట్ల దశమంతరెడ్డి బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో తన సమీప అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై 15 వేల పైచిలుకు ఓట్లతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల్లో కొమ్మూరి ఓవర్ కాన్ఫిడెన్స్ వల్లే ఓటమి పాలయ్యారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది. ఇక పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మధ్య తొలుత టిక్కెట్ లొల్లి జరిగినా.. హైకమాండ్ ఆదేశాలతో ముత్తిరెడ్డి సైలెంట్ అవ్వడంతో పల్లా తన దైన శైలితో కార్యకర్తలను ఏకం చేసుకుని విజయానికి బాటలు వేసుకున్నారనే చెప్పొచ్చు.

## మోడీ మానియాపైనే.. ఆరుట్ల ఆశలు

బీజేపీ భువనగిరి అభ్యర్థిగా బరిలో ఉన్న బూర నర్సయ్య గౌడ్ కోసం జనగామ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో పలు మండలాలు, పట్టణంలో రోడ్ షోలు నిర్వహించిన మోడీ చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ముచ్చటగా మూడోసారి మోడీని ప్రధాని చేయాలనే సంకల్పాన్ని చాటి చెప్పారు. అయితే దేశ వ్యాప్తంగా మోడీ మానియా కొనసాగుతుందనే జోరుగా ప్రచారం సాగుతోంది. దేశంలో ఇందిరా గాంధీ తర్వాత అంతటి చరిష్మా సంపాధించిన వ్యక్తి నరేంద్ర మోడీనే అని, ఈసారి ఆయన ఫొటోనే బీజేపీ అభ్యర్థులకు పెద్ద ప్రచారమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆ ప్రచారమే భువనగిరిలో బూర నర్సయ్య గౌడ్ గట్టెక్కిస్తుందని ఆ పార్టీ వర్గాలు ఉన్నాయి. మొత్తంగానికి గెలుపుపై ఎవరి ధీమా వారికి ఉన్నా.. లోలోప మాత్రం ఓ విధమైన టెన్షన్ అటు అభ్యర్థులు.. ఇటు వారికి సపోర్ట్ చేసిన నేతల్లో కనిపిస్తోంది.

## మెజార్టీపైనే కొమ్మూరి.. గురి!

జనగామ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలచి ఓటమి పాలైన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఈ ఎంపీ ఎన్నికల్లో తమ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అధిక మెజార్టీ ఇవ్వలనే సంకల్పంతో పనిచేశారు. అయితే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు ఉన్నా.. హైకమాండ్ ఆదేశాలతో అంతా కలిసే పనిచేశారు. కానీ ఎవరు ఎటు సపోర్ట్ చేశారనే టెన్షన్ మాత్రం పార్టీ వర్గాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇక ఎన్నికలు పూర్తి కాగా కొమ్మూరి పార్టీలోకి కొందరు లీడర్లకు షోకాజ్ నోటీలు జారీ చేయడం.. వారు తిరిగి ఆయనపై హైకమాండ్ ఫిర్యాదు చేయడం కూడా పార్టీలో ఉన్న గ్రూప్ రాజకీయాలు తెరపైకి తెచ్చినట్టు అయ్యింది. అనుకున్న విధంగా చామలకు మెజార్టీ వచ్చి గెలుపొందితే.. అంతా సవ్యంగా ఉంటుంది.. కానీ, ఏదైనా తేడా జరిగితే ఇక పార్టీలో గ్రూప్ రాజకీయాలు మరింత ఎక్కువై ఒకరిపై ఒకరు ఆరి పోసుకోవడం తప్పదని కొందరు సీనియర్ నేతలు అంటున్నారు. ఏదిఏమైనా ఎమ్మెల్యే ఎన్నికల్లాగా కొమ్మూరి తప్పుతాడా.. లేదా సవాల్ ఎదుర్కొని సక్సెస్ అవుతాడా అనే టెన్షన్ ఆయన వర్గీయుల్లో కనిపిస్తోంది.

## పల్లా.. కాళ్లకు బలపాలు..!

**ఇక ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల కోసం జనగామకు చెందిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి వారి వారి అభ్యర్థల కోసం ముమ్మర ప్రచారం చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఒకే ఒక్కడుగా ఉంటూ ఇటు భువనగిరి, వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో ప్రచారం నిర్వహించారు. భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్ కోసం పల్లా కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగాడని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. మరి పల్లా ప్రచారం క్యామకు కలిసొస్తుందా..! తాను ఎమ్మెల్యేగా సాధించిన మెజార్టీని అందిస్తుందా..! మరి కొన్ని గంటల్లో తేలనుంది.**

